# బుంగలు సహజం..!

**మతిస్థిమితంలేని మాటలు మాట్లాడుతున్నారు • రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వందల కాలువలు నిర్మించేటప్పుడు చిన్న చిన్న బుంగలు పడడం సహజమనీ, దీనిపై కొన్ని పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ స్థాయి అభివృద్ధిపై మంత్రి బుధవారం గజ్వేల్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ వరకు అనేక రకాల నిర్మాణాలు అవుతున్నాయనీ, అందులో అక్కడక్కడా బుంగలు పడడం సహజమని అన్నారు.

మనోహరాబాద్-గజ్వేల్ రైల్వే లైన్‌లో సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి కేంద్రానికి నివేదిక ఇచ్చిన తర్వాత వర్షానికి కొట్టుకుపోయిన మనోహరాబాద్ రైల్వేలైన్‌కు పిఎం, రాష్ట్ర బిజెపి నాయకులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో పాలెం వాగు రెండు సార్లు కొట్టుకుపోయిందనీ, నిర్మాణంలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కూడా కొట్టుకుపోయిందనీ విమర్శించారు. ఎస్సారెస్పీ కాలువలు ప్రారంభానికి ముందే కోతకు గురయ్యాయని



వాటిని మర్చిపోయారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ వరకు కాలువలు ఏర్పాటు చేసి 80 మీటర్ల నుంచి 618 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు తీసుకొచ్చి లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కి దక్కిందన్నారు. ఉత్తమ్ నియోజకవర్గానికి కూడా సాగునీరు అందించిన ఘనత కూడా సిఎందే అన్నారు. రాజకీయ పలుకుబడి కోసం చిన్న చిన్న విషయాలపై రాద్ధాంతం చేయవద్దన్నారు.

## కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం

- గ్రామం మునిగిపోతే సందర్శించరా?
- టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొండపోచమ్మ ప్రాజెక్ట్ నుంచి వెళ్లే జగదేవపూర్ కాలువ పనులు నాసిరకంగా చేపట్టడం వల్లనే శివారు వెంకటపూర్ వద్ద గండి పడిందనీ, ప్రాజెక్టు నిర్మాణం కమీషన్ల కోసమే రీ డిజైన్ చేశారనీ టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వెంకటపూర్ వద్ద గండిపడిన కాలువను బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉత్తమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కమీషన్ల కోసమే సిఎం కక్కుర్తి పడి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రారంభించి వారం రోజులు గడవక ముందే కాలువకు గండి పడి వెంకటపూర్ జలమయమైందన్నారు. బాధిత గ్రామానికి పక్కనే ఫాంహౌజ్‌లో సిఎం ఉన్నప్పటికీ బాధితులను పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటనకు బాధ్యున్ని చేస్తూ ఇఎన్‌సి హరిరాంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిఎం తన సొంత ప్రయోజనాల కోసమే ఉపరితలంలో ప్రాజెక్టు నిర్మించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు తాగు నీరందించకుండా ఉపరితల ప్రాజెక్టుల పేరుతో కొండపోచమ్మ ప్రాజెక్టును నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బిజెపి, టిఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందంతోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా పేర్కొన్న విధంగా తెలంగాణ ప్రాజెక్టులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూకుంట నర్సారెడ్డి, మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## 3న దేశవ్యాప్త నిరసనలకు సిపిఎం మద్దతు

### నేటి నుంచి సింగరేణి కార్మికుల సమ్మెకూ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభవిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వమూ అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తూ కేంద్రం బాటలో నడుస్తున్నదని తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం జరిగే దేశవ్యాప్త నిరసనలు, గురువారం నుంచి శనివారం వరకు జరిగే సింగరేణి కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు, స్వతంత్ర ఉద్యోగ ఫెడరేషన్లు ఈనెల 3న నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయని తెలిపారు. అదే విధంగా వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2,3,4 తేదీల్లో సింగరేణి కార్మికులు 72 గంటల సమ్మెకు పూనుకుంటున్నారని పేర్కొన్నారు.

కరోనాను అడ్డుపెట్టుకుని అసంఘటిత, కాంట్రాక్ట్, వలస కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను ఆదుకోవడంలో, లాక్‌డౌన్ కాలానికి వేతనాలు చెల్లించడంలో విఫలమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించే చర్యలకు పూనుకుంటున్నాయని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.20 లక్షల కోట్ల ప్యాకేజీ వల్ల కార్మికులకు ఒరిగిందేమీలేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం వరుసగా డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అధిక భారాలు మోపుతున్నదని విమర్శించారు. 12 గంటల పనిదినానికి ఆర్డినెన్స్‌ను తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నదని తెలిపారు. సింగరేణిలో 50 కొత్త బొగ్గు గనులను నరేంద్రమోడి ప్రభుత్వం ప్రయివేటు వారికి అప్పజెప్పుతున్నదని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాలను అవలంభిస్తున్నదని తెలిపారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని పేర్కొన్నారు. కార్మికులకు సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. దీంతో సింగరేణి కనుమరుగయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

## సచివాలయం తరలింపు ప్రారంభం

**వారంలోపు కూల్చివేతకు రంగం సిద్ధం**

**మళ్లీ న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న సంఘాలు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత సచివాలయం తరలింపును అధికారులు మళ్లీ ప్రారంభించారు. గతంలో తరలిస్తున్న క్రమంలో కోర్టు అభ్యంతరం చెప్పడంతో ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో దాన్ని కూల్చివేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడ మిగిలిపోయిన వస్తుసామగ్రి, పాత వాహనాలను బుధవారం నుంచి తరలిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత వారం రోజుల్లో సచివాలయాన్ని ప్రభుత్వం కూల్చివేయనున్నట్టు సమాచారం. దశాబ్దాల చరిత్ర కలిగి, ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు వేదికగా నిలిచిన సచివాలయాన్ని కూల్చడం సరికాదన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కూల్చివేయాలన్న నిర్ణయం పట్ల గతంలోనే వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. సచివాలయం కన్నా ఎన్నో వందల సంవత్సరాల క్రితం నిర్మించిన చార్మినార్ వంటి చారిత్రాత్మక భవనాలు కూడా ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయని వారి వాదన. సచివాలయ భవనాలను కూల్చవద్దన్న డిమాండ్‌తో కొన్ని ప్రజా సంఘాలు మళ్లీ న్యాయపోరాటం చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రపంచాన్ని ప్రస్తుతం వణికిస్తున్న కరోనా మహమ్మారి బారిన పడిన బాధితులకు చికిత్సనందించే ఆస్పత్రిగా వినియోగించుకోవడం సముచితంగా ఉంటుందన్న అభిప్రాయాలు వినబడుతున్నాయి. ఇదే వాదనను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని కూడా ఆయా సంఘాలు భావిస్తున్నట్టు సమాచారం.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించొద్దు

### సిఎస్‌కు వినతిపత్రం పంపిన ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రజానీకానికి ప్రభుత్వ కార్యాలయాల ద్వారా విస్తృత సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణ, దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలనీ, వారిని అన్యాయంగా తొలగించవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పాలడుగు భాస్కర్, పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు బుధవారం ఈమెయిల్ ద్వారా వినతిపత్రం పంపారు. పొదుపు చర్యల పేరుతో ఎడ్యుకేషన్ విభాగం, మిషన్ భగీరథ, కొన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, తదితర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. 25, 30 ఏండ్ల నుంచి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న వారిని పక్కనబెట్టడం అన్యాయమన్నారు. ఉద్యోగుల కుదింపు చర్యను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. సంబంధిత శాఖలు ప్రతి ఏడాది లాగానే సర్వీస్ కొనసాగింపు ఉత్తర్వులిచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జులై నుంచి వారికి పూర్తి జీతాలు చెల్లించాలనీ, గుర్తింపు కార్డులు, బస్‌పాస్ సౌకర్యం కల్పించాలనీ, కరోనా నేపథ్యంలో వైద్య సహాయం, ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని విన్నవించారు.






## కేక్స్ విభాగంలోకి మాండలెజ్

హైదరాబాద్ : క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, క్యాడ్‌బరీ బోర్న్‌విటా, ఓరియో వంటి పేరున్న బ్రాండ్ల ఉత్పత్తులను అందించే మాండలెజ్ ఇండియా కొత్తగా కేక్స్ విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. చాకోబేకరీ ఉప విభాగంలో క్యాడ్‌బరీ చాకొబేక్స్ చాక్ లేయర్డ్ కేక్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ ఉత్పత్తులు జులై 2020 నుంచి లభ్యం కానున్నాయని మాండలెజ్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ అయ్యర్ తెలిపారు. చాకొలెట్ రుచిని బార్‌కు మాత్రమే పరిమితం చేయకుండా సంబంధిత విభాగాల్లోకి కూడా తమ పోర్ట్ ఫోలియోను విస్తరిస్తున్నామన్నారు.

## కన్నకూతురిపై లైంగికదాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్న తండ్రే కూతురి బతుకును చిదిమేశాడు. లైంగిక దాడికి ఒడిగట్టిన ఆ దుర్మార్గుడు.. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు పొలానికెళ్లారు. ఆ సమయంలో వారి తండ్రి పెద్ద కుమార్తె (13)పై లైంగికదాడి చేశాడు. ఈ విషయాన్ని అమ్మకు, ఇతరులకు ఎవరికి చెప్పినా చంపేస్తానని కుమార్తెలను బెదిరించాడు. కానీ, భయంతో వణికిపోయిన బాధిత బాలిక ఏడుస్తూ తల్లికి విషయం చెప్పింది. దాంతో తల్లి గురువారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బాబ్లీ గేట్లు ఎత్తివేత

### గోదావరిలో జలకళ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఆర్‌ఎస్‌పి ఎగువన మహారాష్ట్ర సరిహద్దులోనున్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు బుధవారం తెరుచుకున్నాయి. ప్రాజెక్టు ఇఇ గవానే, సిడబ్ల్యుసి ఇఇ శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టు ఇఇ రామారావుల సమక్షంలో మొత్తం 14 గేట్లను ఎత్తారు. ప్రాజెక్టులో ఉన్న 0.67 టిఎంసిల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో గోదావరి జలకళ సంతరించుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఏడాది వర్షాకాలంలో జులై 1న గేట్లు తెరిచి అక్టోబరు 28న మూసివేస్తారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి పూర్తి స్థాయి నీటిమట్టం 1090 అడుగులు (90.313 టిఎంసిలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1074 అడుగుల (29.722 టిఎంసిల) నీరు ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజు 1048 అడుగులు (5.458 టిఎంసిల) ఉన్నట్టు తెలిపారు.

## బిడిఎల్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు బాధ్యతలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బిడిఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్)గా నూక శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈ రక్షణ రంగ సంస్థలో ఫైనాన్స్ విభాగంలో ఆయనకు 24 ఏళ్ల విశేష అనుభవం ఉంది. దీనికిముందు ఆయన ఫైనాన్స్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు. కంపెనీ ఐపిఒలో ఆంకర్ ఇన్వెస్టర్లతో సమన్వయం చేయడంలో కీలకపాత్ర పోశించారు. విద్యా పరంగా ఉస్మానియా యూనివర్శిటీ నుంచి కామర్స్‌లో ఎంబిఎ చేశారు.

## డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ వాయిదా

### దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ వాయిదా పడింది. ఈ మేరకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ఆర్.లింబాద్రి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బిఎ, బికామ్, బిఎస్‌సి, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిఎస్‌డబ్ల్యు తదితర డిగ్రీ కోర్సుల్లో 2020-21 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఈనెల 22న నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతుండడంతో దోస్త్ ప్రవేశాలను వాయిదా వేశామని తెలిపారు. ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియను నిలిపివేశామని స్పష్టం చేశారు. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## గోదావరిలో మునిగిపోయిన నలుగురు

### ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొలి ఏకాదశి రోజున నాలుగు కుటుంబాల్లో విషాదం నెలకొంది. గోదావరిలోకి స్నానానికి వెళ్లిన నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోయారు. వారిలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి ఆచూకీ తెలియలేదు. ఈ ఘటనలు బుధవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో జరిగాయి. డిఎస్‌పి బోనాల కిషన్, సిఐ నర్సయ్య, ఎస్ఐ.శ్యామ్ రాజు, రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పలిమెల మండలం లెంకలగడ్డకు చెందిన ఆకుల కార్తిక్ (22), తోట రవి (21), పంతంగి ప్రదీప్ (20) తొలి ఏకాదశి సందర్భంగా గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఒకరు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా మిగతా ఇద్దరూ పట్టుకోవడానికి ప్రయత్నించారు. కానీ, ముగ్గురూ కొట్టుకుపోయారు. మేడిగడ్డ బ్యారేజి గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది.

## మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కారు బోల్తా

### మరో వాహనం ఢీకొనడంతో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారును మరో వాహనం బలంగా ఢీకొట్టడంతో దామోదర్‌రెడ్డి వాహనం బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళ వారం అర్ధరాత్రి ఖమ్మం జిల్లా సుజాతనగర్ ప్రాంతం డేగలమడుగు గ్రామం వద్ద జరిగింది. సుజాతనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న దామోదర్‌రెడ్డి తిరిగి స్వగ్రామమైన పాత లింగాలకు వెళ్తున్నారు. వారి వాహనం డేగలమడుగు వద్దకు రాగానే టయోటా ఇటియోస్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దామోదర్‌రెడ్డి ప్రయాణి స్తున్న కారు బోల్తాపడింది. స్థానికులు గమనించి వెంటనే కారు అద్దాలు పగులకొట్టి దామోదర్‌రెడ్డి, డ్రైవర్, కాంగ్రెస్ నేతలు నరసింహారావు, రవీందర్‌రెడ్డిని బయటికి తీశారు. ఈ ప్రమాదంలో దామోదర్‌రెడ్డి, డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. సుజాతానగర్‌లో దామోదర్‌రెడ్డికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం స్వగ్రామమైన పాత లింగాలకు వెళ్లి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక సూర్యాపేటకు చేరుకున్నారు. మెరుగైన చికిత్స కోసం బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు.

## సంక్షోభ సమయం.. ధైర్యంగా ఎదుర్కొందాం..

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- ఎమ్‌హెచ్ భవన్‌లో ఘనంగా కొరటాల వర్ధంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత కరోనా సంక్షోభ సమయంలో మనందరమూ తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు సూచించారు. తద్వారా ఆ వైరస్‌ను, దాన్నుంచి ఉత్పన్నమయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, రైతు నేత కొరటాల సత్యనారాయణ వర్ధంతి సభను బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్‌హెచ్ భవన్‌లో నిర్వహించారు. నవతెలంగాణ సిజిఎమ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవులు ముఖ్య అతిథిగా పాల్గొని కొరటాల చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని తెలిపారు. లక్షలమంది దీని బారినపడ్డారనీ, ఎంతో మంది మరణించా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మనల్ని వదిలిపెట్టి ఎప్పుడు పోతుందనే విషయాన్ని అటు శాస్త్రవేత్తలు, ఇటు వైద్యులు చెప్పలేకపోతున్నారని అన్నారు. కాకపోతే ఒక అంచనా ప్రకారం నవంబరు వరకూ దీని ప్రభావముండొ చ్చని అభిప్రాయపడ్డారు. కొరటాల వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రజల పత్రి కైన నవతెలంగాణను ముందకు తీసుకెళ్లాలని రాఘవులు కోరారు. ఎఐఐఇఎ మాజీ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కొరటాల పార్టీలో పెద్ద నాయకుడైనప్పటికీ ఆయన ఎక్కడా ఆ దర్పాన్ని ప్రదర్శించకుండా నాయకులు, కార్యకర్తలను ఎంతో ఆప్యాయతతో సంబోధించేవారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నవతెలంగాణ ఎస్టేట్స్ మేనేజర్ బుచ్చిరెడ్డి, జనరల్ మేనేజర్లు భరత్, రఘు, లింగారెడ్డి, జిల్లా మేనేజర్ వాసు, బ్యూరో చీఫ్ బి.బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కరోనా కట్టడిపై జోక్యం చేసుకోండి

### ప్రధానికి ఎంపి రేవంత్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అత్యధిక పాజిటివ్ కేసులతో హైదరాబాద్ రాబోయే రోజుల్లో కరోనాకు కేరాఫ్ అడ్రస్‌గా మారబోతున్నదని కాంగ్రెస్ ఎంపి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఈమేరకు ప్రధాని నరేంద్రమోడీకి ఆయన లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ సూచనలను, హైకోర్టు ఆదేశాలను, ఐసిఎంఆర్ మార్గదర్శకాలను పెడచెవిన పెడుతుందని లేఖలో ప్రస్తావించారు. దేశంలోని మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ పరిస్థితి దారుణంగా మారబోతున్నదని, వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోనే అత్యధిక కేసులున్న మహారాష్ట్రలో కరోనా పాజిటివ్ రేటు 22శాతం ఉంటే, తెలంగాణలో 27శాతం ఉందని పేర్కొన్నారు. దేశ, విదేశాలకు హైదరాబాద్ నుంచి ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయనీ, తద్వారా ఇన్ఫెక్షన్ రేటు కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం కారణంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 70వేల టెస్టులు మాత్రమే జరిగాయనీ, అదే పక్కనున్న ఎపిలో 6 లక్షల వరకు టెస్టులు చేసినట్టు వివరించారు.

## 3న నిరసనల్లో మున్సిపల్, పంచాయతీ కార్మికులు పాల్గొనాలి

### ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా కాలంలో కార్మికులను ఆదుకోవాలనీ, కరోనా వైరస్ కట్టడిలో ముందు వరుసలో ఉండి పనిచేస్తున్న మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనీ, కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ మున్సిపల్, గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. జులై మూడో తేదీన జరిగే నిరసనల్లో పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ప్రకటన విడుదల చేసిన వారిలో మున్సిపల్ కార్మిక సంఘాల నేతలు ఖమర్ అలీ, పాలడుగు భాస్కర్ (సిఐటియు), ఏసురత్నం, మంద వెంకటేశ్వర్లు (ఎఐటియుసి), వనమాల కృష్ణ (ఐఎఫ్‌టియు), కె.సూర్యం (ఐఎఫ్‌టియు), సుంకిశాల వెంకన్న (ఐఎన్‌టియుసి), భరత్ (ఎఐటియుటియుసి), ఎమ్‌కె.బోస్ (టిఎన్‌టియుసి), యాదయ్య (ఐఎఫ్‌టియు), గ్రామ పంచాయతీ యూనియన్ల నేతలు పి.గణపతిరెడ్డి, చాగంటి వెంకటయ్య (సిఐటియు), రవిచంద్ర, కె.సునీల్ (ఎఐటియుసి), అరుణ్‌కుమార్ (ఐఎఫ్‌టియు), దాసు (ఐఎఫ్‌టియు), శివబాబు (ఐఎఫ్‌టియు) ఉన్నారు. వలస కార్మికులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జెఎసి కోరింది. కీలక రంగాల్లోకి ఎఫ్‌డిలను అనుమతించవద్దని సూచించింది. గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికులందరికీ రూ.8,500 ఇవ్వాలనీ, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలనీ, జిఒ 51ని సవరించాలని కోరింది. మున్సిపల్ కార్మికులకు రూ.24 వేల వేతనం ఇవ్వాలనీ, రూ.50 లక్షల శాశ్వత ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేసింది. మూడోతేదీన పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికులు ప్లకార్డులు, బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చింది.


## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించొద్దు

### సిఎస్‌కు వినతిపత్రం పంపిన ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రజానీకానికి ప్రభుత్వ కార్యాలయాల ద్వారా విస్తృత సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణ, దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలనీ, వారిని అన్యాయంగా తొలగించవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పాలడుగు భాస్కర్, పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు బుధవారం ఈమెయిల్ ద్వారా వినతిపత్రం పంపారు. పొదుపు చర్యల పేరుతో ఎడ్యుకేషన్ విభాగం, మిషన్ భగీరథ, కొన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, తదితర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు.


## జీవించే హక్కును కాలరాస్తున్నారు

- కరోనా పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం
- రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా పరీక్షల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జీవించేహక్కును కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని బుధవారం ధర్మాసనం పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పట్టించుకోవడం లేదని హైకోర్టు అసంతప్తి వ్యక్తంచేసింది. తాము కోరిన నివేదికలు సమర్పించకపోతే కోర్టు ధిక్కరణగా భావిస్తామని హెచ్చరించింది. 17వ తేదీ నాటికి కోర్టు సంతప్తి చెందకపోతే జూలై 20న చీఫ్ సెక్రెటరీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ హెల్త్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, హెల్త్ కమిషనర్ హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఆర్‌ఎడి బ్లడ్ శాంపిల్స్ ఎందుకు చేయకూడదని, 10 నిమిషాల్లో రిజల్ట్ వచ్చే పరీక్షలు చేయాలని ఆదేశించామని తెలిపింది. ఎన్ని యూనిట్స్ తెచ్చారని, ఎందుకు ఇప్పటి వరకు చేయలేదని హైకోర్టు ప్రశ్నించింది. 50 వేల టెస్టులు చేస్తామని చెప్పి.. మూడు రోజులు అసలే టెస్టులు చేయలేదని కోర్టు దష్టికి పిటిషనర్ తరుపు న్యాయవాది తీసుకెళ్లారు. ఇప్పటికైనా ఆర్‌ఎడి శాంపిల్స్ సేకరించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. మే 23 నుంచి జూన్ 23 వరకు ఎన్ని టెస్టులు చేశారని, ప్రైమరీ, సెంకడరీ కాంటాక్ట్స్ శాంపిల్స్ ఎన్ని తీసుకున్నారని హైకోర్టు ప్రశ్నించింది. జూన్ 26న ఐసిఎంఆర్ నిబంధనల ప్రకారం లక్షణాలు ఉన్నవారికి, లేని వారికి ఎన్ని పరీక్షలు చేశారో తెలపాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. సెంట్రల్‌టీం ఎక్కడెక్కడ పర్యటించిందన్న అంశాలను ఈ నెల 17న తెలపాలని హైకోర్టు పేర్కొంది. జీవించే హక్కును హరించేలా ప్రభుత్వం వ్యవహారిస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేసింది. జూన్ 26న టెస్టులు ఎందుకు ఆపేయాల్సి వచ్చిందని ప్రశ్నించింది. డాక్టర్లకు పారమెడికల్ స్టాఫ్‌కి పిపిఇ కిట్స్ ఎన్ని ఇచ్చారో తెలపాలని హైకోర్టు కోరింది.


LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**Laurus Labs Limited**

**Registered Office: Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam – 531021, Andhra Pradesh**
**Corporate Office: 2nd Floor, Serene Chambers, Road No.7, Banjara Hills, Hyderabad – 500 034, Telangana**
**Phone: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320,**
**Email: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com**
**CIN: L24239AP2005PLC047518**

**ADDENDUM TO THE NOTICE FOR THE 15TH ANNUAL GENERAL MEETING OF THE COMPANY**

The Members are hereby informed that the Company had issued the NOTICE of the Fifteenth Annual General Meeting ("AGM" or "Meeting") of the Members of M/s. Laurus Labs Limited ("The Company") to be held on Thursday, July 09, 2020 at 03.00 PM (IST) through video conferencing (VC) facility on June 14, 2020, in compliance with the statutory requirements.

Subsequent to the issuance of AGM Notice, Mr. Narendra Ostawal, Non-Executive Director of the Company (whose re-appointment proposal is in Item No. 5 of the AGM Notice) has tendered his resignation and ceased to be the Director of the Company with effect from July 01, 2020. **Accordingly, the Board took note of his resignation and approved for withdrawal of Item No. 5 contained in the AGM Notice pertaining to the re-appointment of Mr. Narendra Ostawal as a Director.**

Hence, the Company hereby withdraw the Item No. 5 of the AGM Notice as an Addendum to the AGM Notice dated April 30, 2020. The Addendum to the Notice forms an integral part of the Notice of AGM dated April 30, 2020, circulated to the shareholders of the Company.

The remote e-voting/e-voting during the AGM. will not arise for Item No. 5 of the AGM Notice.

Therefore, all the concerned shareholders, stock exchanges, depositories, Registrar and Transfer Agent, other authorities and all other stakeholders are requested to take note of the same.

By Order of the Board
**For Laurus Labs Limited**
**Sd/-**
**G. Venkateswar Reddy**
**Company Secretary & Compliance Officer**

**Place : Hyderabad**
**Date : 01.07.2020**



epaper.prajasakti.com